

11న కలెక్టరేట్‌లో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10:00 గంటలకు జిల్లాలోని స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండల రావు తెలిపారు. ఈ మినీ జాబ్ మేళాలో ఎల్ఐసి, సుస్వాప్‌డిప్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు హాజరు కానున్నాయని చెప్పారు. వీటిలో కంప్యూటర్ ఆపరేటర్, అడ్వైజర్, గోడౌన్ ఇన్‌ఛార్జి డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల్లో పని చేసేందుకు డిగ్రీ, ఇంటర్ పాసైన వారు, 19 నుంచి 38 ఏళ్ల వయసు గల వారు అర్హులన్నారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా తమ పూర్తి వివరాలతో apssdc. Inలో రిజిస్టర్ చేసుకోవాలని, లేదా నేరుగా వేదిక వద్ద రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

హామీల వర్షం

- విద్యుత్ ఛార్జీలు పెంచబోము
- రైతులకు ఏడాదికి రూ. 20వేల ఆర్థిక సాయం
- యువతకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి
- దేవరపల్లి బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, దేవరపల్లి, గోపాలపురం

తాము అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి చేసి ఛార్జీలు తగ్గించేందుకు కృషి చేస్తానని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే బ్రహ్మాండమైన రోడ్లు వేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. దేవరపల్లిలోని మూడు రోడ్ల కూడలిలో నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలపై వరాల జల్లు కురిపించారు. రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున సాయం అందజేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా మహిళలకోసం ప్రకటించిన మహాశక్తి పథకాలను ఒకొక్కటిగా వివరించారు. ప్రముఖ కంపెనీలను తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామని, వర్క్ ఫ్రం హోమ్‌కు శ్రీకారం చుడతానని తెలిపారు. దేవరపల్లిలో వర్క్ స్టేషన్ ఏర్పాటు చేయటంతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెంచి ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి ఉద్యోగాలు చేసుకునేలా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు రూ.3వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా యువత బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాబోయే ఆరు నెలలు జెండాపట్టుకుని రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు జాతిని సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఆదరించిందని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానన్నారు. అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టును రెండు కళ్లుగా భావించానని తెలిపారు. ఆ రెండింటినీ వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. పిల్లల భవిష్యత్తు, సమాజ స్థితిగతులను ఆలోచించి రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. తొలుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావించారు. వైసిపి పాలనలో ఏ ఒక్కరైనా సుఖంగా ఉన్నారా..? అని ప్రశ్నించారు. కరెంటు ఛార్జీలు 8 సార్లు పెంచిన దుర్మార్గుడు జగన్ అన్నారు. నిత్యావసర సరుకులు, ఇంటిపన్నులు పెంచేశారని తెలిపారు. దేవరపల్లిలో మోటార్లకు మీటర్లు పెట్టి రైతులకు ఉరితాళ్లు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల కోసం చాగల్నాడు ఏర్పాటు చేశానని నీళ్లు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను అధికారంలోకొస్తే ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. అవినీతి గురించి ఒకొక్కటిగా వివరించారు. ప్రజల బలహీనతను ఆయుధంగా మార్చుకుని మద్యం ధరలు పెంచి జేబులు నింపుకుంటున్నారన్నారు. ఆ సొమ్మంతా తాడేపల్లి కొంపకు పోతోందన్నారు. గోదావరి చెంత ఉన్నప్పటికీ భవ నిర్మాణ కార్మికులకు ఇసుక దొరకుతుందా..? అని ప్రశ్నించారు. ఇక్కడి ఇసుక బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి ఇసుక మాఫియా జేబులు నింపుకుంటోందని మండిపడ్డారు. వలంటీర్లు చేతికి ప్రజల వ్యక్తిగత సమాచారం ఉండటంతో జరుగుతున్న అనర్థాలను వివరించారు. లాండ్ రికార్డులు సైతం మార్చేస్తూ 50 శాతం అంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సిఎం కార్యాలయంలో అటెండర్ సిఎం డిజిటల్ సంతకం అవినీతికి పాల్పడినా ఇప్పటి వరకూ స్పందించకపోవటంపై సిగ్గుందా అని ప్రశ్నించారు. తన 45 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఇటువంటి సైకో ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. తమపై అక్రమ కేసులు పెడుతున్నారని తాను అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ధర్మాన్ని, న్యాయాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని గుర్తు చేశారు. ఏపి బ్రాండ్ పడిపోయిందని రాబోయే ఎన్నికల్లో వైసిపికి ఐదు సీట్లు వచ్చినా విధ్వంసం తప్పదని తెలిపారు. తండ్రి ఆస్తిలో ముఖ్యమంత్రి తన చెల్లికి ఎందుకు వాటా ఇవ్వలేదని పులివెందులలో ప్రశ్నించినా ఇప్పటికీ సమాధానం జవాబివ్వలేదన్నారు. గోపాలపురం నియోజక వర్గ ఇన్చార్జి మద్దిపాటి వెంకటరాజు, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రులు జవహర్, దేవినేని ఉమా, నిమ్మల రామానాయుడు, పీతల సుజాత, పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన తెలుగుతమ్ముళ్లు, (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు)

సిఎం జగన్‌కు ఘన స్వాగతం



సిఎం వైఎస్.జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మాధవీలత

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో కలెక్టర్ మాధవీలత, ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం ఘన స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన అనంతరం ఏలూరు జిల్లాలోని కుక్కునూరు మండలం గొమ్ముగూడెం పర్యటన అనంతరం హెలికాప్టర్‌లో సోమవారం సాయంత్రం 6.24 గంటలకు సిఎం రాజమహేంద్రవరం చేరుకున్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి, బిసి సంక్షేమ శాఖ మంత్రి శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత, పౌర సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరు వెంకట నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ మార్గాని భరత్ రామ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల కృష్ణ, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా ఛైర్మన్ ఎం.షర్మిలా రెడ్డి, పలువురు ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు సిఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ స్కూల్ ఆయాలు

ఉద్యోగ భద్రత కోసం స్కూల్ ఆయాల ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మున్సిపల్ స్కూల్ ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్స్ పార్ట్ టైం కంటింజెంట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోటగుమ్మం వద్ద గల డిఇఒ కార్యాలయం వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు అధ్యక్షుడు ఎం.సుందరబాబు, యూనియన్ అధ్యక్షుడు వై.ఝాన్సీ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బి.పవన్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఆయాలుగా విధులు నిర్వహిస్తున్నామని, పేరుకి పార్ట్ టైం కంటింజెంట్ వర్కర్ అయినా ఫుల్ టైం వర్కర్ పని చేయిస్తున్నారని అన్నారు. తమను ఫుల్ టైం ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.12000 ఇవ్వాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న అయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజా మద్దతు తెలిపారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు శాంతి, మంగ తయారు, వి.లక్ష్మి, వి.రమణ, చిన్ని, సత్యవేణి, బి.లక్ష్మి పాల్గొన్నారు.

నేడు మేధావులతో చంద్రబాబు సమావేశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మంగళవారం మోరంపూడి గాదాలమ్మ నగర్‌లోని బివిఆర్ కన్వెషన్ హాల్లో వివిధ రంగాలకు చెందిన మేధావులతో సదస్సు నిర్వహిస్తారని పార్టీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సాయంత్రానికి గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లిలో రోడ్ షో పూర్తి చేసుకుని రాత్రికి రాజమహేంద్రవరం చేరుకుని కన్వెన్సన్ హాల్లో బస చేస్తారని వివరించారు. మరుసటి రోజున 8వ తేదీ ఉదయం వివిధ రంగాలకు చెందిన మేధావులతో, ప్రధానంగా ఇరిగేషన్ పట్ల అవగాహన ఉన్న వారితో సదస్సు నిర్వహిస్తారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో ఇరిగేషన్‌ను, ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రం ఎలా నష్టపోతోందన్న అంశంపై చర్చిస్తారన్నారు. సదస్సు అనంతరం సీతానగరం మండలంలోని పురుషోత్తపట్నం 'ఫేజ్-1' ను సందర్శిస్తారని తెలిపారు. అక్కడ నుంచి కోరుకొండలో సాయంత్రం జరిగే బహిరంగ సభకు చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. ఈ బహిరంగ సభకు రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం నుంచి సుమారు 5 వేల మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరవుతారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

విఆర్ఎల సంఘం రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం బొమ్మూరు కలెక్టరేట్ వద్ద విఆర్ఎలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ నిరసనగా ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్.మూర్తి, టిఆర్ఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కె.రెహ్మాన్ మాట్లాడారు. విఆర్ఎలకు గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. నాలుగేళ్లుగా విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు ప్రభుత్వాధికారులకు రాజకీయ పెద్దలకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రస్తుతం తమకిస్తున్న చాలీచాలని రూ.10,400తో జీవితాలు వెళ్లదీస్తున్నట్టు చెప్పారు.



ధర్నా చేస్తున్న విఆర్ఎలు

వేతనాలపై మిడ్డే మీల్స్ కార్మికుల వినతి

ఉంగ్రాజవరం : తమ సమస్యలు పరిష్కరించి జీతాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని మిడ్డే మీల్స్ కార్మికులు ఎంపిపి పాలాటి యల్లారీశ్వరికి విజ్ఞప్తి చేశారు. ఉంగ్రాజవరం నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో సోమవారంమిడ్ డే మీల్స్‌ను పరిశీలించేందుకు ఎంపిపి రావడంతో కార్మికులు ఆమెకు తమ గోడు వినిపించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గకుండా చూడాలని, తప్పనిసరిగా ప్రభుత్వం నిర్ణయించిన మెనూ అమలు చేయాలన్నారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకుని, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఇఒ-1 సక్సేనా రాజు వద్ద ఆమె వివరాలు తెలుసుకున్నారు.

కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు ద్వితీయం

ప్రజాశక్తి-రాజానగరం

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఉమెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ద్వితీయ స్థానం దక్కిందని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో కిక్ బాక్సింగ్‌లో విజేతగా నిలిచిన కె.జ్యోతికుమారిని విసి సన్మానించి జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఉత్తర్ ప్రదేశ్‌లో మార్చి 20 నుండి జరిగిన పోటీలలో సిఆర్.రెడ్డి కళాశాల ఏలూరు విద్యార్థిని కె.జ్యోతికుమారి ద్వితీయ బహుమతిగా సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకుందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి రూ.20 వేల క్యాష్ అవార్డు, సర్టిఫికెట్స్‌ను అందజేసామన్నారు. జ్యోతికుమారి మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జ్యోతికుమారి తల్లి కె.నాగమణి, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కోచ్ వి.అంజిబాబు, సిహెచ్.చంద్రశేఖర్, ఎం.భవానీశంకర్, పి.నాగరాజు, ఎ.ధర్మేంద్ర స్పోర్ట్స్ బోర్డు కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సుబ్బారావు, సెక్రటరీ డాక్టర్ బి.రామ్‌గోపాల్, డాక్టర్ బాల సత్యనారాయణ, డాక్టర్ వివిఎంయు.ఫణీంద్ర, డాక్టర్ ఎంవివిఎస్.మూర్తి, హబీబ్ బాషా పాల్గొన్నారు.

చాగల్లు -రాజమహేంద్రవరం ఆర్‌టిసి సర్వీసు నడపాలి

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండల కేంద్రం నుంచి రాజమహేంద్రవరం ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల యూనియన్ సభ్యుడు వెచ్చ గంగాధరం కోరారు. గతంలో చాగల్లు మండలం పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండేదని, ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో కలిపారన్నారు. ప్రభుత్వ జిల్లా కార్యాలయాలకు వెళ్లాలన్నా, ఆసుపత్రులు, విద్యాలయాలకు ఇతర అవసరాలకు రాజమండ్రి వెళ్లేందుకు చాలా ఇబ్బంది పడుతున్నట్లు ఆయన తెలిపారు. రాజమండ్రి ప్రయాణం చేయాలంటే చాగల్లు నుండి పంగిడి వరకు ఆటోలోనూ అక్కడ నుండి రాజమండ్రి బస్సు కు వెళ్తూ చాలా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు.

కానూరులో గర్భిణులకు సాముహిక సీమంతం

ప్రజాశక్తి-పెరవలి

కరపత్రు కానూరులో సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలను 59, 60 కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను గర్భిణులకు వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రిపాలు తాగించడం వల్ల కలిగే ఉపయోగాలు బిడ్డకు పాలిచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తల్లి పాలు తాగిన పిల్లలు మంచి బలవర్ధకంగా ఆరోగ్యంగా పెరుగుతారని, సమాజానికి మంచి ఆరోగ్యకరమైన యువతను అందించాలంటే బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెరవలి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోలా సీతారాముడు ఆర్థిక సహకారంతో 15 మంది గర్భిణులకు సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ శ్రీలక్ష్మి టి.దుర్గ, కె.బేబీ కుమారి, మేడిచర్ల భాస్కర శివకుమార్, పాల వెంకటేశ్వరరావు, పాల పద్మ, తోట సురేష్, బూరుగుపల్లి రాజు, సలాది ఉదయ భాస్కర్, కొమ్మిశెట్టి రాము, శిరిగినీడి శేషగిరిరావు పాల్గొన్నారు.

9న కార్మికుల ధర్నా కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

మోదీ పాలనలో హీన స్థితిలో కార్మిక, కర్షకులు ఉన్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాంబాబు, ఐఎఫ్‌టియు నాయకులు కె.జోజి అన్నారు. సోమవారం నగరంలో స్టేడియం వద్ద గల ఎఐటియుసి కార్యాలయంలో ఆగస్టు 9 కార్మిక సంఘాల ధర్నా కరపత్రం ఆవిష్కరణలో వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ, కార్మికులను బానిసలుగా మార్చేందుకు 46 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని, 3 వ్యవసాయ చట్టాల రూపంలో రైతాంగ భూములను కార్పొరేట్లకు అప్పగించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే విశాఖ ఉక్కు, ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటు దోపిడీదారులకు అప్పగించేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారన్నారు. 8 ఏళ్లలో ఆరు లక్షల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయని, వీటిలో పనిచేసే లక్షలాది మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. భారత దేశం మోడీ హయాంలో ఆకలి సూచికలో బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల కంటే వెనుకపడినట్టు ప్రపంచ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. నిరుద్యోగాన్ని, అధిక ధరలను, ఆహార సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం పరిష్కారం చేయలేక, మణిపూర్ రాష్ట్రంలో వందల ఏళ్లుగా కలిసున్న మైతే, కుకి ప్రజల మధ్య ఎస్‌టి రిజర్వేషన్ల సమస్యను సృష్టించి మరణహోమానికి కారణమయ్యారని తెలిపారు. కార్మికుల వ్యతిరేక విధానాలను అమలు చేసే పార్టీలకు ప్రజలు, కార్మికులు, మేధావులు ఓటుద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9 న క్విట్ ఇండియా స్ఫూర్తితో జరిగే జరిగే ధర్నాకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు వి.కొండలరావు, కె.రామకృష్ణ, ఎం.వీరభద్రరావు, ఇఫ్టు నాయకులు కోరాడ అప్పారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


వైఎస్ఆర్ లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. సంబంధిత దరఖాస్తును నేరుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం, బొమ్మూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయం పక్కన వైటిసి బిల్డింగ్ కార్యాలయంలో పని సమయాల్లో అందచేయ వలసినదిగా తెలిపారు. జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డి.ఎం.ఎం.శేషగిరి వివరాలు తెలుపుతూ, వివిధ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులు తగిన ఆధారాలతో తమ ధరఖాస్తును ఒక పేజికి మించకుండ వారు సాధించిన విజయాల వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, ఇ మెయిల్ వివరాలు పంపాలని చెప్పారు. దరఖాస్తును ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఇ మెయిల్ sportsinap@gmail.com, cashincentives. saap @gmail.com dsa konaseema 2022 @gmail.comకు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.00 గంటలలోగా పంపించాలని సూచించారు. వివరాలకు 8639774430లో సంప్రదించాలన్నారు.

పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలోని వివిధ గ్రామాల్లో పలు కారణాల వల్ల ఖాళీ అయిన సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు నోటిఫికేషన్ సోమవారం వెలువడింది. దమ్మెన్ను పంచాయతీలో తొమ్మిదో వార్డు, కె.సావరంలో 11వ వార్డుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మంగళవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుందని ఎంపిడిఒ జివిఎస్‌కెఆర్.రాజు తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు పదో తేదీ చివరి రోజు కాగా, 11వ తేదీన స్క్రూటినీ జరుగుతుందని, 14న నామినేషన్ ఉపసంహరణ, 19న ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలు వెల్లడి ఉంటాయని చెప్పారు.

కార్టూ'నిజం'



చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, కడియం

ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పథకాలను అమలు చేస్తున్నట్టు కలెక్టర్ డా కె. మాధవీలత పేర్కొన్నారు. స్థానిక దానవాయిపేటలోని నేత బజార్‌లో జాతీయ చేనేత దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, చేనేత కార్మికుల ఇబ్బందులు తెలుసుకుని వారికి భరోసా ఇచ్చేలా 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులను పెన్షన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. జిల్లాలో రెండు క్లస్టర్ల ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వాటికి కేటాయించిన నిధులు ఆయా సొసైటీల్లో ఉండే చేనేత కార్మికులు అభివద్ధి కోసం ఏ విధంగా ఉపయోగ పడుతుందో ఆలోచన చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ కూడు గూడు గుడ్డ అవసరం ఉందని, చేనేత కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి చేనేత వస్త్రాలను ధరించి ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 1,362 మంది చేనేత కార్మికులకు ప్రతినెలా రూ.2,750 చొప్పున పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడి బి.ధనుంజయ్, కె.పెద్దిరాజు, కృష్ణ భాస్కర్, గంగరాజు, బళ్లా ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.



కడియంలో చేనేత కార్మికులను సత్కరిస్తున్న నాయకులు

కడియం మండలంలోని వీరవరం చేనేత సహకార సంఘంలో చేనేత మహిళా కళాకారులను పూలమాలలతో సత్కరించి, చీరలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, చేనేత సంఘ చైర్మన్ దొంతంశెట్టి చినవీర్రాజు మాట్లడారు. ప్రభుత్వం నేత కార్మికులకు ప్రతీ సంవత్సరం రూ.24 వేలు ఇవ్వడం హర్షణీయమన్నారు. చేనేత క్లస్టర్ ద్వారా వర్క్ షెడ్‌లు, చేనేత కార్మికులకు కావాల్సిన మగ్గం పరికరాలు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం చేనేతపై వేసిన జిఎస్‌టిపై పునరాలోచించి, వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకట్రావు, డైరెక్టర్స్ శంకర్రావు, సత్తిబాబు, నాగేంద్ర పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసనలు

ప్రజాశక్తి-గోకవరం, సీతానగరం

మణిపూర్‌లో జరిగిన దుర్ఘటనపై గోకవరం గ్రామానికి చెందిన ఎరుకల ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కాళ్ల భీమరాజు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జల్తా నాగరాజు, సెక్రటరీ రావుల మారయ్య, జాయింట్ సెక్రెటరీ నక్క రాజేష్, ట్రెజరర్ మర్రి మారయ్య, సభ్యులు బండి రాము, రమేష్, హంసఫర్గుల గోవిందు పాల్గొన్నారు. సీతానగరం మండల వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. సీతానగరం సెంటర్లో మానవహారాన్ని చేపట్టారు. నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహశీల్దారు ఎస్.సత్యనారాయణ రాజుకు వినతి పత్రాన్ని అందించారు. ఎంపిడిఒ కె.రమేష్‌కు కూడా వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా పలువురు వైసిపి నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీతానగరంలో మానవహారం

భవిత సెంటర్‌లో కో ఆర్డినేటర్ తనిఖీలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరంలోని భవిత సెంటర్‌ను సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ కనక బాబు సోమవారం తనిఖీ చేశారు. భవిత సెంటర్‌కు సంబంధించిన రికార్డులను పిల్లలు హాజరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత సెంటర్లో 14 మంది పిల్లలు ఉండటంతో సెంటర్‌లో పిల్లల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. సెంటర్‌కు ఫిజియోథెరపీ డాక్టర్‌ను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సెంటర్ ఆయా పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మురారి శివారు గుర్తు తెలియని వ్యక్తిని లారీ ఢీకొని వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన అతన్ని పెట్రోలింగ్ వాహనంపై గండేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుని వయస్సు 45 ఏళ్లు ఉంటుందన్నారు. వివరాలు తెలిసిన వారు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ప్రియుడిని కడతేర్చిన మహిళ

ప్రజాశక్తి - అన్నవరం

ఒక వివాహిత తన ప్రియుడిని చున్నీతో గొంతు నిలిమి హతమార్చింది. ఈ ఘటన శంఖవరం మండలం కొంతంగిలో చోటుచేసుకుంది. ప్రత్తిపాడు సిఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు కొంతంగికి చెందిన జి.దుర్గభవాని అనే మహిళకు ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన పడగం చిన్నదుర్గాప్రసాద్(21) కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఆమె భర్త శ్రీను లారీ డ్రైవర్ కావడంతో విధి నిర్వహణలో దూరప్రాంతాలకు వెళ్లేవాడు. ఈ క్రమంలో మంగాదేవి దుర్గాప్రసాద్‌తో పరిచయం పెంచుకుంది. ఆదివారం రాత్రి మంగాదేవి ఇంటికొచ్చిన ప్రసాద్‌తో ఆమె ఘర్షణకు దిగింది. దీంతో కళ్లలో కారం కొట్టి చున్నీతో మెడను నులిమి చంపేసింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు సిఐ తెలిపారు.

యువకుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

ఎస్.యానాం కట్టు కాలువలో ఆదివారం గల్లంతైన వన్నెచింతలపూడికి చెందిన చిత్రి ముఖేష్ కుమార్(19) మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌టిఆర్ ఆశయాల్లో భాగంగానే అన్నా క్యాంటీన్ నిర్వహణ

జగ్గంపేట : ఎన్‌టిఆర్ ఆశయాలను నెరవేర్చడంలో భాగంగానే పేదవాడి ఆకలి తీర్చడానికి అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ రోడ్‌లోని ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద సోమవారం అన్నా క్యాంటీన్‌లో ఆహారాన్ని పంపిణీ చేశారు. జగ్గంపేటకు చెందిన కె.తాతారావు, అనంతలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ రద్దు చేసిన ఈ ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేందుకు జగ్గంపేటలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ, మారిశెట్టి భద్రం, కంచుమర్తి రాఘవ, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు,ఎండి కాజా, బోండా రాజేష్, వేములకొండ జోగారావు, దేగల సత్తిబాబు, ఎస్ వి ప్రసాద్, మండపాక అప్పన్న దొర, ముంత దుర్గ, ముంత చంద్రమ్మ, మేడిశెట్టి సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు సూరిబాబుతో సభ్యులు

ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షునిగా సూరిబాబు ప్రమాణ స్వీకారం

గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ అధ్యక్షునిగా పాము సూరిబాబు, డైరెక్టర్లుగా బొర్రంపాడుకు చెందిన చెరుకు సూర్యనారాయణ, సుబ్బయ్యమ్మ పేటకు చెందిన గొల్లవిల్లి రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపిపి కుంచె రాజా, బొర్రంపాడు సర్పంచ్ పోకల సుబ్బారావు, సుబ్బయ్య పేట సర్పంచ్ బొబ్బర శివకుమార్ పాల్గొన్నారు.

సిరిపురంలో మౌలిక వసతుల కరువు

కరప : మండలంలోని సిరిపురం కనీస మౌలిక వసతులు కరువయ్యాయని జనసేన కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ అన్నారు. సోమవారం సిరిపురంలో నున్న మాధవ్, నున్న గణేష్‌నాయుడు ఆధ్వర్యంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు తీర్చండి

కరప : మండలంలోని అన్నదాతలకు సాగునీటి కష్టాలు తీర్చాలని, ఎండుతున్న వందల ఎకరాల పంట భూములను రక్షించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్‌బాబా డిమాండ్ చేశారు. మండలంలోని వేములవాడ, యండమూరు, తదితర గ్రామాల్లో పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సార్వా సీజన్ ఆరంభంలోనే సాగునీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. నాట్లకు నీరందక ఎండిపోయే ప్రమాదంలో పడ్డాయన్నారు. నీటి ఎద్దడికి ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యమే కారణమన్నారు. జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని వెల్ల లాకుల నుంచి నార్త్ కెనాల్‌పై, చింతపల్లి లాకులకు సంబంధించిన సంపర బోధి పరిధిలో సాగయ్యే వందల ఎకరాల భూములకు నీరందక ఎండుతున్నాయన్నారు. స్థానిక ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, అధికారులు స్పందించి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండేటి బక్కయ్య, పాలిక వెంకటరమణ, నక్క వీరన్న, అనుసూరి నాగరాజు, పోలినాటి సత్తయ్య, శ్రీపాదం పండు పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలకు భయపడేది లేదు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి - కోటనందూరు

వైసిపి ప్రభుత్వం అరాచకాలకు భయపడేది లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తుని రూరల్ తేటగుంటలో టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య ఆధ్వర్యంలో 'మీ ఇంటికి మీ దివ్య' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా సమస్యలను వింటూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. తేటగుంట టిడిపి కార్యాలయంలో తుని నియోజకవర్గ సమన్వయ కమిటీతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధికార వైసిపి అరాచకాలు సృష్టించి ప్రతిపక్షాలను దెబ్బ కొట్టేందుకు చూస్తుందన్నారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరేది లేదన్నారు. వైసిపి కుతంత్రాలను ఎదురొడ్డి టిడిపి విజయానికి అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దొంగ ఓట్లు నమోదైతే వాటిని తీయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. యనమల దివ్య మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కనపెట్టి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోతుకూరి వెంకటేష్, పి.శేషగిరి, డి.శ్రీను, జి.రాజబాబు, ఎ.రమేష్, పి.సూరిబాబు, షేక్ నవాజ్ జానీ, భాస్కర్, అంకమరెడ్డి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

పాలిటెక్నిక్ అడ్మిషన్స్‌లో జాప్యం తగదు

ప్రజాశక్తి - కాకినాడ

పాలిటెక్నిక్ అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రాము, ఎం.గంగాసూరిబాబు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి అడ్మిషన్లను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పదో తరగతి పరీక్షల ఫలితాలు వచ్చిన ఐదు రోజులకే పాలిసెట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారన్నారు. పాలిసెట్ ద్వారా 1.41 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా దాదాపు 1.20 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. నేటికి 75 రోజులు గడుస్తున్నా అడ్మిషన్లలో ఎందుకు తాత్సర్యం చేస్తుందని ప్రశ్నించారు. గత విద్యా సంవత్సరం 74,491 సీట్లు ఉంటే 35,735 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. గత అనుభవాలతో అడ్మిషన్లను పూర్తి చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్నడు లేని విధంగా రెండు నెలలు పైగా ఆలస్యం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో డిగ్రీ, ఇంటర్ మినహా మిగిలిన అన్ని సెట్లు అడ్మిషన్లు పూర్తి కాకపోవడం ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తుందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పాలిటెక్నిక్ అధికారులు వారంలోగా వెబ్ ఆప్షన్స్ ప్రారంభించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

స్త్రీనిధి నిధుల్లో విఒఎ చేతివాటం

విచారణ చేపట్టిన ఎజిఎం

ప్రజాశక్తి - గండేపల్లి

స్త్రీనిధి నిధుల్లో విఒఎ చేతివాటం ప్రదర్శించింది. 11 గ్రూపులకు చెందిన రూ.లక్ష వరకూ సొంత ఖర్చులకు వాడుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై సోమవారం స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వై.చిట్టిబాబు విచారణ నిర్వహించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. స్త్రీనిధి వాయిదాల సొమ్ము దారి మళ్లింపుపై గ్రామంలో విచారణ చేపట్టామన్నారు. విఒఎ అఖిల సుమారు లక్ష రూపాయలు వాడుకుందన్నారు. అందులో రూ.20వేలు జమ చేసిందని మిగిలిన రూ.80వేలు రెండు మూడు రోజుల్లో చెల్లిస్తానని తెలిపారన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

దీనిపై పలువురు మహిళలు మాట్లాడారు. గతంలో మురారిలో విఒఎ ఇలాగే అవినీతికి పాల్పడగా తిరిగి రికవరీ చేయించారే తప్ప చర్యలు తీసుకోలేదన్నారు. మూడు నెలలుగా తాము స్త్రీనిధికి వాయిదాలు చెల్లిస్తున్నా బ్యాంక్ అకౌంట్‌లోకి జమ చేయకుండా వాడుకోవడం దారుణమన్నారు. రాజకీయ నాయకులు నిందితులకే కొమ్ముగాయడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మహిళలు కోరుతున్నారు. ఇదే విధంగా ప్రతి గ్రామంలోను డ్వాక్రా రుణాలు, స్త్రీ నిధి వాయిదాలపై తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పలువురు మహిళలు చెబుతున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎజిఎం చిట్టిబాబు

ఘనంగా రోసమ్మ వర్ధంతి

ప్రజాశక్తి - పిఠాపురం

మద్యాన్ని నిషేధించాలని పోరాడిన యోధురాలు దూబగుంట రోసమ్మ ఏడవ వర్ధంతిని జెవివి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సూర్య విద్యానంద గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ మాట్లాడారు. దూబగుంట గ్రామంలో రోసమ్మ సారా వ్యతిరేక ఉద్యమం ప్రారంభించి మహిళల్లో చైతన్య నింపారన్నారు. దూబగుంట గ్రామంలో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమం రాష్ట్రానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. మద్యపానం వల్ల కుటుంబాలు ఆర్థికంగాఆరోగ్యపరంగా నష్టపోతున్నాయన్నారు. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూసే ప్రభుత్వాల వైఖరి మారాలన్నారు. అనంతరం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, జెవివి జిల్లా నాయకులు కె.అప్పారావు, జిల్లా గౌరవాధ్యక్షులు వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. రోసమ్మ స్ఫూర్తితో మహిళలు మద్యపానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పిఠాపురం అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, వి.ప్రేమలత, చిన్నారి, మణమ్మ, సమతా జిల్లా కన్వీనర్ ఉమా మంగతాయారు, ప్రజా సంఘాల నాయకులు జిఎస్.భాస్కరాచార్యులు, కె.విశ్వనాథం, సత్యనారాయణ , పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను జెసి ఎస్.ఇలాక్కియా ఆదేశించారు. ఈనెల 30లోగా సామర్లకోటలోని జగనన్న లేఔట్‌లో సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాలను చేపట్టనున్నారు. దీనికి సిఎం జగన్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో పలు శాఖల అధికారులతో జెసి సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల్లో అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. సామర్లకోటలో మాత్రం 25 శాతం మాత్రమే నిర్మాణాలుపూర్తయ్యాయన్నారు. తక్షణమే లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలన్నారు. మధ్యలో నిర్మాణాలను నిలిపేసిన వారిని వెంటనే గుర్తించి ఇళ్లను పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. నెలాఖరు నాటికి తప్పకుంటా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఒ కెఎన్‌వి.ప్రసాదరావు, మెప్మా పీడీ బి.ప్రియంవధ, హౌసింగ్ పీడీ సుదర్శన్ పట్నాయక్, హౌసింగ్ ఇఇలు వై.శ్రీనివాస్, ఆర్‌ఎస్‌కె.రాజు, డిప్యూటీ హౌసింగ్ ఇఇ జి.రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ కుమారి, ఎంపిడిఒ శ్రీలలిత, మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ పాల్గొన్నారు.

బాబు పర్యటన జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జగ్గంపేట

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు తూర్పుగోదావరి జిల్లా పర్యటన విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. సోమవారం జగ్గంపేటలోని ముఖ్య నాయకులతో ఈ మేరకు ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 8న చంద్రబాబు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై రిటైర్డ్ ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. పురుషోత్తపట్నం ఫేజ్-1 ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి కోరుకొండలో జరిగే భారీ బహిరంగ సభకు విచ్చేస్తారని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, క్లస్టర్ ఇన్‌ఛార్జి జీను మణిబాబు, పట్టణ అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త కొండబాబు, కిర్లంపూడి మండలం మాజీ ఎంపీపీ కంచుమర్తి రాఘవ పాల్గొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ డిఎస్.సునీత, సివిల్ సప్లయీస్ డిఎం డి.పుష్పమణి, డిపిఒ ఆర్.విక్టర్‌లతో కలిసి ఆమె హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 440 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇచ్చే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు.

తాళ్లరేవులో మూడు పంచాయతీల్లో ఎన్నికలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో మూడు పంచాయతీల్లో ఒక సర్పంచ్, రెండు వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. జార్జిపేట పంచాయతీ సర్పంచ్ కోలా సత్యవతి అకాలంగా మరణించడంతో సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నారు. నీలపల్లిలో 2వ వార్డు సభ్యులు, తాళ్లరేవులో 11వ వార్డు సభ్యుల పదవికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని ఆమె తెలిపారు. 8 నుంచి నామినేషన్ల స్వీకరణ 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు జార్జి పేట, నీలపల్లి, తాళ్లరేవు పంచాయతీల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.

లక్ష్మణస్వామివర్మ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం వ్యవస్థాపకుడు పొన్నమండ లక్ష్మణస్వామివర్మ సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. కోరంగిలో లక్ష్మణస్వామివర్మ 154వ జయంతిని అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ మాట్లాడారు.కోరంగిలో పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ, మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహాలను ఏర్పాటుకు రూ.లక్ష విరాళం అందించారు. అలాగే హైదరాబాదు నుంచి విచ్చేసిన సంఘం నాయకులు తమ్మం వేంకటేశ్వరరావు విరాళాన్ని అందించారు. మాజీ ఎంఎల్ఎ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మాట్లాడుతూ మల్లాడి సత్యలింగం నాయకర్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా నాయకులు పట్టా ఆదినారాయణ వర్మ, వైదాడి నూకరాజు, మాజీ జెడ్పిటిసి పొన్నమండ రామలక్ష్మి, పెమ్మాడి బాబురావు, కామాడి మాతరాజు, ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, అంతర్వేది దేవస్థానం నిర్మాణకర్త కొపనాతి కష్ణమ్మ వారసులు తదితరులు మాట్లాడారు. అంతకుముందు పెద్ద బొడ్డు వెంకటాయపాలెంలో పొన్నముండ లక్ష్మణ స్వామి వర్మ, మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహాలకు అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కోరంగిలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరంగి మాజీ సర్పంచ్ బర్రె బుజ్జిబాబు , వాడ్రేవు వీరబాబు, కొల్లు వీరబాబు, పలు మత్స్యకార గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బొడ్డు సత్యనారాయణ

న్యూట్రిగార్డెన్ పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని అచ్చంపేట గ్రామంలో మహిళలకు న్యూట్రీ గార్డెన్‌ల పెంపకంపై సోమవారం అవగాహన కల్పించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూట్రీగార్డెన్ అధికారి సుశీల మాట్లాడారు. కుటుంబం నిర్వహణలో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. న్యూట్రీ గార్డెన్ల ద్వారా కుటుంబ సభ్యులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించొచ్చన్నారు. అలాగే ఇంట్లో దొరికే కనీస వనరులతో, చిరుధాన్యాలతో రకరకాల వంటలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. 30 మంది మహిళా సభ్యులకు రిలయన్స్ ఫౌండేషన్ వారిచే 11 రకాల విత్తనాలను అందించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బి.నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ బి.రామలక్ష్మి, అచ్చంపేట యూనిట్ ఇన్‌ఛార్జి జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మహిళా శక్తి కార్యక్రమం ద్వారా తొలి విడత మేనిఫెస్టోలో టిడిపి అధినేత మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించారనిమహిళా నేతలు పేర్కొన్నారు. సోమవారం పి.వేమవరంలో టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసు ఆధ్వర్యంలో ఇంటింటికీ మహిళా శక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మేనిఫెస్టోలో చంద్రబాబు ప్రకటించిన పథకాల కరపత్రాలను పంచుతూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నేతలు నంది ఉమామహేశ్వరి, గుత్తుల సూర్యావతి, బొందల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సమాచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

తమ గ్రామంలో సమస్యలపై జిల్లా స్థాయి స్పందనలో అర్జీలు ఇచ్చామని, వీటిని పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు తప్పుడు సమాచారం ఇచ్చారని కాకినాడ జిల్లా రాజ్యాధికార పార్టీ, బిసి ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు రాయుడు మోజెస్‌బాబు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్‌కు వినతిపత్రం అందించారు. పంచాయితీలో అక్రమ రికార్డుల నిర్వహణపై విచారణ చేపట్టాలన్నారు. లేకుంటే గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగుతామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నంలోని గోగులమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సోమవారం సచివాలయం అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 24 గంటలు ప్రజలకు మంచినీరు అందుబాటులో ఉండేలా వీధి కొళాయి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేణి, శ్రీనివాసు, భువనేశ్వరి, మాధవి, దుర్గ, ఏసు, వెంకటరమణ, నాగమణి, శ్రీను, రాజామణి, లోవరాజు, పద్మావతి, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

మదర్ థెరీసా పోస్ట్ గ్రాడ్యుయేషన్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్స్, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ సోమవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు' అనే నినాదంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కాలేజ్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కనకాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ షణ్ముగం, ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహాశక్తి'పై ఎంఎల్ఎ చినరాజప్ప ప్రచారం

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహాశక్తి పథకపై ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చంద్రమాంపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు(కోటి), నాయకులు రేలంగి బుజ్జి, ఎం.కృష్ణమూర్తి, టి.నాని, కె.వెంకటేశ్వరరావు, కె.బుజ్జి, బి.రాంబాబు, కాశీరాజు, వై.శ్రీను, పి.సత్తిబాబు, తాతబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ ఛార్టీస్ భూములు కాపాడాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

విద్యాదాత శ్రీ మల్లాడి సత్యలింగ నాయకర్ చారిటీస్‌కు చెందిన భూములను రక్షించాలని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు సోమవారం కలెక్టర్, ఎండోమెంట్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. పబ్లిక్ ఆక్షన్ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టి సంస్థకు చెందిన భూములను దోచుకోవడానికి ఎమ్మెల్యే ద్వారంపూడి కుట్ర పన్నుతున్నారన్నారు. లీజు సాకుతో ద్వారంపూడి తన అనుచరులకు సంస్థ భూములను కట్టబెట్టడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారనానరు. దీన్ని రద్దు చేయాలన్నారు. ఆయన వెంట చింతా పేర్రాజు, దండుప్రోలు నాగబాబు, రేకాడి లోవరాజు, మల్లాడి రాజు తదితరులున్నారు.

దస్తావేజులు పడిపోయినవి

మా క్లయింట్ తూర్పుగోదావరి జిల్లా, బిక్కవోలు మండలం, బలభద్రపురం గ్రామం, తాతానగర్, డోర్ నెం. 8-20రు కాపురస్తులు **అంజూరి శ్రీను గారి భార్య అంజూరి కుమారి గారు** మాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది, మా క్లయింట్ ది. 09-03-2022 సం॥రం తేదీన తూర్పుగోదావరి జిల్లా, (ప్రస్తుతం డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా) రామచంద్రపురం మండలం, వేగాయమ్మపేట కాపురస్తులు వడ్లమూరి మాచర సత్య బాల శ్రీనివాసరావు గారి భార్య వడ్లమూరి దుర్గ గారి వద్ద **దస్తావేజు నెం. 1123/2022** గా బలభద్రపురం గ్రామం తాలూకు **సర్వే నెం. 261/3** నందు పూరా య. 0-56ట్లులో తూర్పువైపు మధ్య గ్రామపంచాయితీ లెక్కలలో క్రొత్త 8వ బ్లాకు (పాత 9వ బ్లాకు తాతానగరం)లో రివైజ్డ్ డోర్ నెం. 8-44రు ఇంటి సమీపంలోని 232 చ॥గ॥లులో పడమర వైపు 145.53 చ॥గ॥లుకు 121.68 చ॥మీ॥ ఖాళీ నివేశ్న స్థలం కొనుగోలు చేసి బిక్కవోలు సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో రిజిష్ట్రీ చేయించిన క్రియ దస్తావేజు మరియు సదరు దస్తావేజుకు లింకు దస్తావేజు అయిన **దస్తావేజు నెం. 4948/2017** గా బిక్కవోలు సబ్ రిజిష్ట్రీ వారి ఆఫీసులో రిజిష్ట్రీ కాబడిన లింకు దస్తావేజు మా క్లయింట్ భర్త గారైన అంజూరి శ్రీను గారు జిరాక్స్ తీయించు నిమిత్తము ది. 06-08-2017 గా బిక్కవోలు మెయిన్ రోడ్డులోని జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా సదరు దస్తావేజులు ఒరిజినల్స్ దారిలో ఎక్కడో పడిపోయినవి. ఎంత వెతికినను లభించలేదు. పై దస్తావేజులు ఎవరికైనా దొరికినచో మాకు తెలియజేయగలరు. సదరు దస్తావేజులు ఎవరికైన దొరికిన అక్రమ లబ్ది పొందుటకు ప్రయత్నించినా అట్టవి చెల్లనేరవు, అట్టివి మా క్లయింట్‌ను బైండ్ చేయవని ఇందుమూలముగా జనరల్ పబ్లిక్‌కు యావన్మందికి తెలియజేయడమైనది.

శ్రీ మేడపాటి రవిషణ్ముఖరెడ్డి
శ్రీ గొలుగూరి బుల్లిరెడ్డి
అడ్వకేట్స్, అనపర్తి, తూ॥గో॥జిల్లా
అనపర్తి సెల్: 9849414626
ది.07-08-2023 93480049999

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి - యానాం

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యానాంలో ఓటర్ల జాబితా సవరణ కోసం బూత్ స్థాయి అధికారులు అయ్యన్ననగర్, సుభద్ర నగర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని ఓటర్ల నమోదు అధికారి, ఆర్ఎఒ మునిస్వామి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సవరించడంతోపాటు, చనిపోయిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు, 17 ఏళ్లు నిండిన వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. చిరునామా మార్పులు చేర్పులు నిబంధనలను అనుసరించి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధనాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా కోర్టు : కాకినాడ
I.A. 2/2020 in O.S. 27/2020
Between:
పాలిక వెంకట సాయిలక్ష్మి
...పిటీషనర్ / ప్లయింటిఫ్
మరియు
పాలిక శ్రీనివాసరావు వగైరాలు
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

R_{10} : **కొండేపూడి ప్రసాద్ కుమార్,** S/o. రాజు, వయస్సు 36 సం॥లు, ప్రైవేటు ఉద్యోగస్థుడు, డో.నెం. 5-169, రాఘవేంద్రనగర్, బొమ్మూరు గ్రామం, రాజమహేంద్రవరం రూరల్.

పై నెంబర్ దావాలో I.A. No. 2/2020లో మీరు 10వ రెస్పాండెంట్ అయ్యి ఉన్నారు. మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు వంపిననూ తీసుకోకుండా కాలయావన చేయుచున్నారు. పై నెంబర్ పిటీషన్ **ది. 21-08-2023 సం॥ తేదీన** వాయిదా అయ్యి ఉన్నది. కావున మీరు పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

మహారాజశ్రీ 3వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ 1st క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా
O.S. No. 945/2022
Between:
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, R.A.S.M.E.C.C. & S.A.R.C., దానవాయిపేట, రాజమండ్రి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్ S.A.R.C. Wing.
-వాది
మరియు
మామిడి రమణ, S/o. శ్రీకృష్ణ, హిందువు, వయస్సు 48 సం॥లు, ఆటో డ్రైవర్, R/o. డో.నెం. 67-25-1975, సింహాచల్ నగర్, రాజమహేంద్రవరం, R.J.C.J. Court Limits.
-ప్రతివాది

పై నెంబరులో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 14-8-2023 సం॥రం తేదీన** పై నెంబరు గల దావా నందు **ఉదయం 10.30 ని॥లకు** మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు వాయిదా వేసినారు. కావున మీరు పై తేదీన స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.వి.వి.ఎస్.నారాయణస్వామి
రాజమండ్రి **కె.ఇందిర**
03-8-2023 అడ్వకేట్స్, రాజమండ్రి

నోటీసు
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No. 698/2022
O.S. No. 279/2022
Between:
కోనాల పద్మావతి అనే పద్మ -పిటిషనర్/వాది
AND
సత్తి సీతారామలక్ష్మి వగైరాలు -ప్రతివాద్దు/రెస్పాండెంట్లు
To:
4. కర్రి వెంకటకృష్ణ త్రినాధరెడ్డి, S/o. late నారాయణ రెడ్డి 31 సం॥లు, హిందు, వ్యవసాయం, డోర్ నెం. 3-152, విజయకృష్ణ అపార్ట్‌మెంట్ ప్రక్కన, ఇందిరా నగర్, అనపర్తి, అనపర్తి మండలం.
-4వ ప్రతివాది/ 4వ రెస్పాండెంట్

పై నెంబరు IA దావా పిటిషన్ గ్రంధమునకు సంబంధించి 4వ ప్రతివాది/ 4వ రెస్పాండెంట్ యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 17-8-2023** వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
శ్రీ సబ్బెళ్ళ తాతారెడ్డి
శ్రీ కోనాల శ్రీధర్‌రెడ్డి
వాది తరపు అడ్వకేట్స్, అనపర్తి

దావా సమను
మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 279/2022
Between:
కోనాల పద్మావతి అనే పద్మ -వాది
AND
సత్తి సీతారామలక్ష్మి వగైరాలు -ప్రతివాద్దు
To:
4. కర్రి వెంకటకృష్ణ త్రినాధరెడ్డి, S/o. late నారాయణరెడ్డి 31 సం॥లు, హిందు, వ్యవసాయం, డోర్ నెం. 3-152, విజయకృష్ణ అపార్ట్‌మెంట్ ప్రక్కన, ఇందిరా నగర్, అనపర్తి, అనపర్తి మండలం. -4వ ప్రతివాది

పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి 4వ ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 17-8-2023** వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు **ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
శ్రీ సబ్బెళ్ళ తాతారెడ్డి
శ్రీ కోనాల శ్రీధర్‌రెడ్డి
వాది తరపు అడ్వకేట్స్, అనపర్తి